క్లుప్తంగా

ప్రశాంతంగా జుమ్మా ప్రార్థనలు



జకాత్ విధివిధానాలను వివరిస్తున్న ఇమామ్

ఎన్పీకుంట: స్థానిక జామియా మసీదులో శుక్రవారం ముస్లింలు జుమ్మా ప్రార్థనలను ప్రశాంతంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల ఖాజీ, జామియా మసీదు ఇమామ్ హజ్రత్ బాబ్జాన్ (యూసుఫ్) రంజాన్ మాసంలోని చివరి పది రోజుల విశిష్టతను, జకాత్ గురించి వివరించారు. ఆర్థిక స్థోమత కలిగిన ప్రతి ఒక్కరూ ఏడాదిలో తమ స్థిర, చరాస్తులు, నగలు, నగదు, సంపదలను విలువ కట్టి అందులో నుంచి 2.5 శాతం జకాత్ రూపంలో విధిగా పేదలకు ఇవ్వాలన్నారు. జకాత్ కేవలం పండుగ ముందు మాత్రమే ఇష్టానుసారంగా ఖర్చు పెట్టక ముందే నిర్భాగ్యులు, పేదలకు ఆదుకునేందుకు ఉపయోగించడం మంచిదని పేర్కొన్నారు.

క్విజ్ ఫెస్టివల్

బత్తలపల్లి: స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో శుక్రవారం చిన్నారులకు క్విజ్ ఫెస్టివల్ నిర్వహించారు. ముదిగుబ్బ, ధర్మవరం, బత్తలపల్లి ఏరియా చిన్నారులు తొలి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి ఆర్డీటీ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ మోహనమురళి, రీజనల్ డైరెక్టర్ ప్రమీల బహుమతులు ప్రదానం చేశారు. క్విజ్ మాస్టర్లు, టీటీఎంలు, నాగభూషణ, వెంకటేష్, ఆయా ఏరియాల ఎటీఎల్‌లు, ఎస్టీ ఎల్‌లు, ఆర్ఈలు, సీఓలు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం



రోగులకు భోజన ప్యాకెట్లు అందిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం రోగులకు సత్యసాయి సేవా సమితి సభ్యులు అన్నదానం చేశారు. నారాయణ సేవలో భాగంగా దాతల సహకారంతో 380 మంది రోగులు, వారి సహాయకులకు భోజనం ప్యాకెట్లు అన్నం, పప్పు, పెరుగన్నం, వాటర్ ప్యాకెట్లు, గర్భిణులకు స్వీట్లు పంపిణీ చేశారు.

పార్శిల్ అప్పగింత

బత్తలపల్లి: బస్సు మీద నుంచి కింద పడిపోయిన పార్శిల్‌ను తపాలా సిబ్బందికి అప్పగించిన ఘటన బత్తలపల్లిలో చోటు చేసుకుంది. వివరాలు.. గురువారం ఆర్టీసీ బస్సు నుంచి తపాలా శాఖకు చెందిన రూ.17,641 విలువైన పార్సిల్ గాలికి రోడ్డుపై పడిపోయింది. అక్కడే జాతీయ రహదారి పనులు చేస్తున్న ఎస్టీ ఇన్ఫ్రా సిబ్బంది గమనించి పార్శిల్‌పై ఉన్న నంబర్లలో సంప్రదించారు. ఈ మేరకు శుక్రవారం ధర్మవరం పోస్టల్ సిబ్బంది బత్తలపల్లికి వచ్చి పార్శిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

కరాటే మాస్టర్‌కు ప్రశంసాపత్రం

ధర్మవరం అర్బన్: ధర్మవరం కరాటే మాస్టర్ పాల్తూరు హరికృష్ణ అనంతపురం అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. హరికృష్ణ అనంత ఆత్మ రక్షణ కార్యక్రమంలో భాగంగా అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు స్వీయరక్షణపై అవగాహన కల్పించారు. దీంతో ఇటీవల అనంతపురంలోని రెవెన్యూ భవన్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అతడికి అసిస్టెంట్ కలెక్టర్ ప్రశంసాపత్రం అందించారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

బత్తలపల్లి: పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను ఆయన తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. పరీక్షలు ముగిసే వరకు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, టీ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు.

పరస్పర సహకారంతోనే ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సురేష్‌నాయక్

ధర్మవరం అర్బన్: పరస్పర సహకారంతోనే ఉపాధి అవకాశాలు సాధ్యమని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌నాయక్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సంకల్ప్ ప్రోగ్రాంలో భాగంగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ నరసయ్య మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కళాశాలలు, ఇండస్ట్రీలు సంయుక్తంగా పనిచేసి యువతి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ముందుకు సాగాలన్నారు. జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఇండస్ట్రీ నైసర్గిక స్వరూపం ఎటువంటి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ, రీసోర్స్ పర్సన్ శ్రీనివాసులు, కియా పరిశ్రమ ప్రతినిధులు, జిల్లా పారిశ్రామిక శిక్షణ సంస్థ ఐటీఐ ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

యూరియాతో ముప్పే

- పశుగ్రాసం పెంపకంలో అతిగా వినియోగం
- ఆ గ్రాసం తిన్న పాడి ఆవుల్లో క్యాల్షియ లోపం
- పాల నాణ్యత తగ్గి దారుణంగా ధరల పతనం



పశుగ్రాసం పెంపకం



తలుపుల: పశుగ్రాసం ఏపుగా పెరగడం కోసం యూరియాను అతిగా వినియోగిస్తున్నారు. అలాంటి మేత తిన్న పాడి ఆవుల్లో క్యాల్షియం లోపిస్తోంది. తద్వారా పాల నాణ్యత తగ్గి.. ధరలూ పడిపోతున్నాయి. పశువులకు మేతగా వినియోగించే దాణా, పిండి పదార్థాలు గల చెక్క, తవుడు, ఆల్‌మిక్స్, గోధుమ పొట్టు తదితరాల ధరలు బాగా పెరగడం వల్ల రైతులు పశుగ్రాసంపై ఆధార పడాల్సివస్తోంది. గ్రాసం పెరిగేందుకు మిశ్రమ ఎరువులతో పాటు సేంద్రీయ పద్ధతులు పాటించాలి. కానీ వీటి వలన పంట త్వరగా పెరగదు. తక్కువ ధరకు లభించే యూరియా వాడితే త్వరగా పంట ఏపుగా పెరుగుతుంది. దీంతో రైతులు పశుగ్రాసం సాగులో ఇష్టానుసారంగా యూరియా వాడుతున్నారు.

పాల నాణ్యతపై ప్రభావం

కదిరి నియోజకవర్గంలో 60 వేల పశువులున్నాయి. 45 వేల మంది వరకు పాడి రైతులు ఉన్నారు. రోజుకు 50 నుంచి 60 వేల లీటర్ల వరకు పాల ఉత్పత్తి అవుతోంది. అయితే యూరియా ఎరువుతో పండిన పశుగ్రాసాన్ని తిన్న పాడి ఆవుల్లో క్యాల్షియం లోపం కనిపిస్తోంది. దీంతో ఆవులు ఈనడంలోనూ సమస్యలు తప్పడంలేదు. ముఖ్యంగా పాలధర తగ్గడానికి ఇది కారణమవుతోంది. సాధారణంగా ఆవు పాలు ఎల్ఆర్ (లాక్టోమీటర్ రీడింగ్) 26 నుంచి 28 శాతం ఉండాలి. 26 కంటే తక్కువ వస్తోంది. ఎస్ఎన్ఎఫ్ (సాలిడ్స్ నాట్ ఫ్యాట్) పోషక విలువల శాతం 8.5 ఉండాలి. కానీ 8 కంటే తక్కువకు పడిపోయింది. ఈ కారణంగా పాల ధరల్లో లీటరుకు రూ.5 నుంచి రూ.8 దాకా వ్యత్యాసం వస్తోంది. ప్రస్తుతం ఆవు పాలకు క్వాలిటీని బట్టి లీటరు ధర రూ.35 నుంచి రూ.42 వరకు పలుకుతోంది.

అవగాహన లేక అనర్థాలు



కొందరు రైతులు అవగాహన లేక తక్కువ ధరకే దొరుకుతుందని యూరియాను విపరీతంగా వాడుతున్నారు. దీని వల్ల ఆవుపాలు తగిన నాణ్యత రావడం లేదు. ఈ పాలను తాగితే భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది. రైతులు 5, 10 బస్తాల యూరియాను గ్రాసం పెంపకంలో వినియోగిస్తున్నారు. వాటిని తిన్న పశువులు, ఆ పాలు తాగిన వారి పరిస్థితి భవిష్యత్‌లో ఇబ్బందికరంగానే ఉంటుంది.

– ప్రసన్నబాయి, ఏడీఏ, తలుపుల

సేంద్రియ ఎరువులు వాడాలి



ఇటీవల యూరియా వాడకం విపరీతంగా పెరిగిపోయింది. దీంతో యూరియా కొరత ఏర్పడుతోంది. యూరియాతో మొక్క ఏపుగా పెరగం తప్ప ఇతర ప్రయోజనాలు ఏవీ ఉండవు. అతిగా వాడడం వల్ల భూమి కలుషితమై పనికి రాకుండా పోతుంది. భూసార పరీక్షలు చేయించి, ఏ మోతాదులో ఏ ఎరువు వాడాలో తెలుసుకొని వాడాలని చెబుతూనే ఉన్నాం. రైతులు సేంద్రియ ఎరువులు వాడితే చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

– షాదాబ్, ఏఓ, తలుపు

ప్రజా సమస్యలపై పోరాడదాం



పేరూరులో గ్రామకమిటీని ఎంపిక చేస్తున్న నాయకులు

రామగిరి: ప్రజా సమస్యలపై పోరాడదామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీనుగ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం పేరూరు పంచాయతీలోని దుబ్బార్లపల్లి, ఏడుగురాకులపల్లి, పి.కొత్తపల్లి, పేరూరు గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చిన్నముత్యాలు, సుబ్బుక్రిష్ణ, గుడుసాల ఈశ్వరయ్య, గొని వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, నాగరాజు, ప్రసాద్, వెంకటేశులు, గోపాల్, శివానంద, పురుషోత్తం, వెంకటేశులు, అజయ్, కె.ముత్యాలు, బండారు అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ కాలనీ సమస్యలు తీర్చాలి

ధర్మవరం: పట్టణంలోని మహాత్మాగాంధీ కాలనీలోని సమస్యలను తీర్చాలని సీపీఎం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, జేవీ రమణ, అయూబ్‌ఖాన్, ఆలకుంట మారుతి అధికారులను కోరారు. శుక్రవారం వారు కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో తాగునీరు, వీధిదీపాలు, రోడ్లు, డ్రైనేజీ తదితర వసతులను కల్పించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. కాలనీలో బోరు చెడిపోయి ఏళ్లు గడుస్తున్నా కనీసం మరమ్మతులు చేయడంలేదన్నారు. సీపీఎం నేతలు ఖాదర్‌బాషా, హైదర్‌వలి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



గ్రామ కమిటీ సభ్యులతో వైఎస్సార్‌సీపీ నాయకులు



సమావేశమైన వైఎస్సార్‌సీపీ నాయకులు

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ఐకమత్యంతో కృషి చేయాలని పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాశీవిశ్వేశ్వరాలయంలో పార్టీ గ్రామస్థాయి కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు అందరూ శ్రమించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, తాతిరెడ్డి, ప్రకాష్ రెడ్డి, నారాయణ స్వామి, బొగ్గకిష్ట, నాగార్జున, రామాంజి, ఓబులేసు, అక్కుల్‌రెడ్డి, హనుమంతరెడ్డి, పూజారి ఆంజనేయులు, భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, అశోక్ కుమార్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను సీఎంగా చేసుకుందాం

కనగానపల్లి: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసి, అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా చేసుకుందామని ఆ పార్టీ జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని తగరకుంట, భానుకోట, కొండపల్లి గ్రామాల్లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. పార్టీ మండల కన్వీనర్ నాగముని, పలువురు మండల నాయకులు స్థానిక గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. గ్రామ కమిటీల నియామకంపై చర్చించారు. అనంతరం గ్రామాల వారీగా పార్టీ కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అమరనాథరెడ్డి, పెద్దిరెడ్డి, రమణారెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, తగరకుంట వెంకటరాముడు, మాధవరెడ్డి, నారాయణ స్వామి, ముత్యాలు చంద్ర, భానుకోట సర్పంచ్ బాలరాజు, మాధవరాజులు, కొండపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల ఆత్మహత్యాయత్నం

కనగానపల్లి: కుటుంబ సమస్యలతో మండలంలో వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నం చేశారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని వేపకుంట గ్రామంలో ఎరుకల దుర్గాప్రసాద్ అనే యువకుడు వ్యవసాయ భూమిలో తనకు వాటా ఇవ్వలేదని తండ్రి వెంకటప్పను బెదిరించేందుకు గురువారం రాత్రి పురుగుల మందు సేవించాడు. కుటుంబ సభ్యులను గుర్తించి అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. ఇక మండలంలోని మద్దెలచెరువు గ్రామంలో పద్మావతి అనే వివాహిత తెగిపోయిన తన పుస్తెల తాడు చేయించలేదని భర్త కొండప్పతో గొడవపడింది. మనస్తాపానికి గురైన ఆమె శుక్రవారం ఇంటి వద్దనే విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు గుర్తించి ఆమెను వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు.

సీపీఐ నుంచి పోలా లక్ష్మీనారాయణ తొలగింపు

ధర్మవరం: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు పాల్పడుతున్న పోలా లక్ష్మీనారాయణను సీపీఐ నుంచి తొలగించినట్లు ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, సహాయ కార్యదర్శి రమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, వెంకటస్వామి, శ్రీనివాసులు, బాలరంగయ్య విలేకరులతో మాట్లాడారు. ఇక నుంచి పోలా లక్ష్మీనారాయణకు తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

ఓడీచెరువు: సున్నంపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. తంగేడుకుంటకు చెందిన నాగరాజు వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై ఓడీచెరువుకు బయలుదేరాడు. ఈక్రమంలో ఎదురుగా వచ్చిన కారును వేగంగా ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని 108లో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

ముదిగుబ్బ ఎంపీపీపై ఫిర్యాదు

పుట్టపర్తి టౌన్: గిరిజన భూముల కబ్జాకు సంబంధించి ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణపై బీజేపీ సంఘటనా కార్యదర్శి నూకాల మధుకర్‌కు ఆపార్టీ నేతలు బాధితులతో కలిసి ఫిర్యాదు చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మధుకర్‌ను కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీపీ ఆదినారాయణయాదవ్ ముదిగుబ్బ మండలం అడవిబ్రాహ్మణపల్లితండా వాసులకు చెందిన 100 ఎకరాలను తమ బంధువుల పేరిట మార్చుకుని బ్యాంకులో రుణాలు పొందారన్నారు.

కోడి గెదిరిందని ఘర్షణ

ముదిగుబ్బ: మలకవేమల క్రాస్‌లో శుక్రవారం ఇంటి ముందు కోడి గెదిరిందని కురుబ ఆంజనేయులు, బోయ ఆంజనేయులు అనే ఇద్దరు ఘర్షణ పడ్డారు. పరస్పర ఫిర్యాదుల మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

బాధితులకు ఆర్థికసాయం

నల్లమాడ: పెమనకుంటపల్లి తండాకు చెందిన మెడికల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి తిప్పేంద్రనాయక్ శుక్రవారం పేదలు, అనారోగ్య పీడితులైన 10 మందికి ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తిప్పేంద్రనాయక్ తెలిపారు. తండావాసులతో కలిసి మారెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేపట్టారు. దాత తిప్పేంద్రనాయక్ భార్య పార్వతమ్మ, తండావాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ హర్షణీయం

బత్తలపల్లి: ఎస్సీ వర్గీకరణ హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కేసగాళ్ల వెంకటేష్, ధర్మవరం డివిజన్ ఎమ్మార్పీఎస్ నాయకులు సాకే లక్ష్మన్న కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుమతం కాటమయ్య, ఎస్సీ జన సంఘం ఇన్‌చార్జ్ మాల్యవంతం రాంప్రసాద్, ధర్మవరం బీఎస్పీ ఇన్‌చార్జ్ సాకే వినయ్‌కుమార్, సీపీఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్, బేడా బుడగ జంగం బాల కుళ్లాయప్ప, ఎమ్మార్పీఎస్ నాయకులు గంటాపురం నారాయణస్వామి, బావప్ప, సంచులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడం హర్షణీమని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ సర్కిల్‌లో దళిత సంఘం నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. నాయకులు తోపు పారేసు, బావన్న, చంద్రప్ప, రమణ, రామాంజినేయులు, శంకర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద శుక్రవారం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్, రాష్ట్ర నాయకులు ఆనంద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

శాలివాహన జయంతి జయప్రదం చేయండి

బత్తలపల్లి: గౌతమీపుత్ర శాతకర్ణి, కుమ్మర శాలివాహనుడు జయంతిని విజయవంతం చేయాలని ఉమ్మడి అనంతపురం జిల్లా కుమ్మర శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు కుమ్మర మదనాపు పోతులయ్య కోరారు. శుక్రవారం బత్తలపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శాలివాహన చక్రవర్తి జయంతిని శనివారం అనంతపురంలోని రాచానపల్లి వద్దనున్న కుమ్మర శాలివాహన కమిటీ హాల్‌లో నిర్వహిస్తామన్నారు.


స్కూటర్ అపహరణ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్ వద్ద హోండా డియో స్కూటర్ అపహరణకు గురైంది. వివరాలు..గొల్లపల్లి గ్రామానికి చెందిన సాకే బాబు పని నిమిత్తం పట్టణానికి వచ్చి కళాజ్యోతి సర్కిల్ వద్ద వాహనాన్ని ఉంచాడు. గుర్తు తెలియని వ్యక్తులు వాహనాన్ని ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

వారపు సంత వేలం

ముదిగుబ్బ: ముదిగుబ్బ వారపు సంత, గొర్రెల సంతకు శుక్రవారం ఎంపీడీఓ దివాకర్ ఆధ్వర్యంలో వేలం పాటను నిర్వహించారు. ఉత్తమ నాయుడు అనే వ్యక్తి రూ.11,26,000 వేలం దక్కించుకున్నాడు. సర్పంచ్ లక్ష్మీదేవి, పంచాయితీ కార్యదర్శి మంజుల, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



శరణ్య

ముదిగుబ్బ: ఈ నెల 28న పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి అండర్–15 పోటీలకు ముదిగుబ్బలో విశ్వ భారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థిని వట్టిపల్లి శరణ్య ఎంపికైనట్లు కోచ్ నర్సింహనాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–15 టీంకు జరిగిన ఎంపికల్లో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని విశ్వభారతి స్కూలు ఉపాధ్యాయులు అభినందించారు.

ఆల్ ఇండియా బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



షమీమ్

ధర్మవరం అర్బన్: ఆల్ ఇండియా బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు కళాశాల పీడీ ఆనంద్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా పీడీ ఆనంద్ మాట్లాడుతూ ఎస్‌కే యూనివర్సిటీ నిర్వహించిన సెలక్షన్లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఎస్.షమీమ్ యూనివర్సిటీ జట్టుకు ఎంపికైందన్నారు. ఈనెల 28 నుంచి తమిళనాడు అలగప్ప యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు.


తాగునీటి సమస్య తీర్చాలని వినతి

నల్లమాడ: మండల కేంద్రంలోని మేదర కాలనీలో తాగునీటి సమస్యను తీర్చాలని సీపీఐ నాయకులు శుక్రవారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. సీపీఐ పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి అంజినేయులు మాట్లాడుతూ మేదర కాలనీలో నెలరోజుల నుంచి తాగునీటి సమస్య నెలకొన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను పట్టించుకోలేదన్నారు. రక్షిత తాగునీరు, సత్యసాయి నీటిని మండలం కేంద్రంలో పలువురు ప్రజలకు అందకుండా పండ్ల తోటలు, ఇటుక బట్టీలకు తరలిస్తున్నారన్నారు. సీపీఐ మండల కార్యదర్శి వెంకటరమణ, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె. చంద్ర, నాయకులు గంగాద్రి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలని వినతి

తాడిమర్రి: తమకు అదనపు పనిభారం తగ్గించాలని ఎంపీడీఓ వెంకటరంగారావుకు శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం ఇచ్చారు. స్థానిక కార్యాలయంలో కార్యదర్శులు భాస్కర్, రిజ్వానాబేగం, నారాయణస్వామి, పరమేశ్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ శాఖ తమకు అప్పగించిన 30 రకాల పనుల పర్యవేక్షణతోనే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. వీటికి తోడు సచివాలయ సిబ్బందితో కలిసి మరో 20 పథకాల సర్వేలను చేయలేక తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

చిన్నారుల ఎదుగుదలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ సరస్వతి

బత్తలపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల్లో ఎదుగుదలపై దృష్టి సారించాలని సీడీపీఓ సరస్వతి అంగన్‌వాడీ వర్కర్లకు సూచించారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో పోషణ భీ-పడాయి భీ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు శిక్షణా కార్యక్రమంలో చిన్నారుల పెరుగుదల, శ్యాం, మ్యామ్, కేంద్రాల్లో 1000 రోజులు ఏవిధంగా సంరక్షించాలి అనే విషయాలపై వర్కర్లకు అవగాహన కల్పించారు. ఏసీడీపీఓ సునంద, సూపర్‌వైజర్లు దేవమణి, లలితమ్మతో పాటు అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి/రామగిరి: చిన్నారులకు ఆటపాటలతో బోధించాలని సీడీపీఓ కవితా దేవి, సూపర్‌వైజర్ అరుణకుమారి సిబ్బందికి సూచించారు. న్యామద్దెల ఉన్నత పాఠశాల, రామగిరిలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారుల భవిత కోసం కేంద్ర ప్రభుత్వం పోషణ్ భీ-పడాయి భీ పథకాన్ని ప్రారంభించిందన్నారు.